ప్రజాశక్తి
ఆదివారం 7 ఏప్రిల్ 2024 5 అనంతపురం





కంబదూరు వద్ద అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్

అసమ్మతి రాగం..!



ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాజకీయ వేడి జోరందుకుంది. నామినేషన్లకు సమయం ఆసన్నం అవుతుండడంతో అభ్యర్థులు ప్రచారాలను మరింత వేగవంతం చేశారు. గెలుపుకోసం వ్యూహాలు, ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. అయితే అభ్యర్థులకు అసమ్మతి సెగ గట్టిగానే తగులుతోంది వైసిపి టిడిపి, రెండు పార్టీల్లోనూ అసమ్మతి జ్వాలలు కన్పిస్తున్నాయి. అభ్యర్థి ఎంపికను నిరసిస్తూ ఇప్పటికే కొందరు ప్రత్యర్థి పార్టీలోకి చేరిపోగా, మరికొందరు చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

- టిడిపి, వైసిపిలో కొనసాగుతున్న అసంతృప్తులు
- రాజీనామాలు చేసి పక్కపార్టీలోకి పయనం
- అసమ్మతి నేతలను బుజ్జగిస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. ఇందులో 2019 ఎన్నికల్లో 12 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి విజయం సాధించింది. హిందూపురంలో బాలకృష్ణ, ఉరవకొండలో పయ్యావుల కేశవ్‌లు ఇద్దరు మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి గెలుపొందారు. అనంతపురం, హిందూపురం రెండు పార్లమెంటు స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. ప్రస్తుతం జరగోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమిలో భాగంగా ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం బిజెపికి కేటాయించింది. తక్కిన 13 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకు టిడిపి అభ్యర్థులు బరిలోనున్నారు. బిజెపికి కేటాయించిన ధర్మవరం సీటులోనూ స్థానిక మాజీ ఎమ్మెల్యే జి.సూర్యనారయణకు కాదని, స్థానికేతరుడు అయిన సత్యకుమార్‌ను బిజెపి అభ్యర్థిగా నిలిపింది. దీంతో జి.సూర్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దింగేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో బిజెపికి ఆశించినంత సానకూలత లేదు. తక్కిన స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులున్న చోట్ల అసంతృప్తులు కొనసాగుతున్నాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో దుగ్గపాటి వెంకటప్రాసద్‌కు కేటాయించడం పట్ల మాజీ ఎమ్మెల్యే ప్రభకర్ చౌదరి అసంతృప్తితోనున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అమిలినేని సురేంద్రబాబుకు టిడిపి టిక్కెట్టు ఖరారు చేసింది. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న మాదినేని ఉమామహేశ్వరనాయుడు వైసిపిలో చేరారు. గుంతకల్లు టిక్కెట్టు గుమ్మనూరు జయరాంకు కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ మద్దతుదారులు సహకరించే పరిస్థితి కన్పించడం లేదు. మడకశిరలో డాక్టర్ సునీల్‌కుమార్‌కు కేటాయించడంపై కొంత మంది టిడిపి మద్దతుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక హిందూపురం ఎంపి టిక్కెట్టు దక్కకపోవడంతో మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప పార్టీకి రాజీనామ చేసి వైసిపిలో చేరుతానని ప్రకటించారు.

వైసిపిలోనూ అసంతృప్తులు

అధికార వైసిపిలోనూ అసంతృప్తులు కొనసాగుతూనే ఉన్నాయి. శింగనమల అభ్యర్థి వీరాంజినయులును మార్చాలని కొంత మంది వైసిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న మహమ్మద్ ఇక్బాల్‌ను తొలగించి దీపికను నియమించారు. దీంతో మహమ్మద్ ఇక్బాల్ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ పార్టీకి, పదవికి రాజీనామా చేశారు. ధర్మవరంలో చేనేత నాయకుడు గిర్రాజు వైసిపికి రాజీనామా చేశారు. ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ తాజాగా పార్టీకి రాజీనామా చేశారు. అనంతపురం అర్బన్‌లో అసంతృప్తులు అధికంగానున్నారు. తాజాగా నలుగురు కార్పొరేటర్లు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. కదిరి వైసిపిలోనూ పెద్ద ఎత్తునే అసమ్మతి కన్పిస్తోంది. శనివారం నాడు తనకల్లు మార్కెట్ యార్డు ఛైర్మన్, నంబులపూలకుంటా మాజీ ఎంపిపిలు వైసిపికి రాజీనామా చేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తాం

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికలకు సంబంధించి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తాంమని ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ అమిత్ బర్దర్ ఓటర్లకు తెలియజేశారు. శనివారం ఉదయం బుక్కరాయసముద్రం మండలం శిద్ధరాంపురం గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్పీ పాల్గొని ప్రజల్లో భరోసా కల్పించారు. గొడవలు, అల్లర్లులేని హింసారహిత ఎన్నికలే తమ లక్ష్యమన్నారు. స్థానికంగా ఏవైనా సమస్యలుంటే తమ దష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. గొడవలు, అల్లర్లు జోలికెళ్లకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో ఆ పద్ధతి, విధి విధానాలను తహశీల్దార్ హనుమాన్ నాయక్ ద్వారా ప్రజలకు వివరింపజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి, బిఎస్ఎఫ్ డీఎస్పీ ధర్మేంద్ర, బుక్కరాయసముద్రం సిఐ వెంకటేశులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర సరిహద్దుల తనిఖీ

కంబదూరు వద్ద చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును ఎస్పీ అమిత్ బర్దర్ పరిశీలించారు. ఎన్నికల వేళ కర్నాటక నుంచి మద్యం, డబ్బు, ఎన్నికల తాయిలాలు అక్రమంగా ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించార. కర్నాటక నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ కంబదూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్షించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ లు, పల్లెనిద్రలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, రూరల్ సిఐ నాగరాజు, కంబదూరు ఎస్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


శింగనమల : ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుద బలగాలు కవాతు నిర్వహించాయి. ఇందులో భాగంగా మండల పరిధిలోని పెరవలి, పోతురాజుకాలవ, శివపురం, సి.బండమీదపల్లి గ్రామాల్లోని వీధుల్లో సిఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ డీఎస్పీ ధర్మేంద్రసింగ్, పోలీసులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని

కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

బకాయి ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ కోవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్ ఆటో డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో శనివారం భిక్షాటన చేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్‌లో విభాగాల వారీగా ప్రతి ఉద్యోగి సీటు వద్దకూ వెళ్లి కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని, మీకు తోచిన సహాయం చేయాలని ఉద్యోగులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ ఉగాది పండగను దృష్టిలో ఉంచుకుని కమిషనర్ త్వరగా జీతాలు ఇవ్వాలని కిందస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే అధికారులు ఒకరిపై మరొకరు నెపం నెడుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. వేతనాలు చెల్లించకపోతే ఉగాది పండుగ సమయంలో కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి నెలకొందన్నారు. బకాయి జీతాలపై అధికారుల నిర్లక్ష్య వైఖరి మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బకాయి వేతనాలతోపాటు ప్రతినెలా ఐదో తారీకు లోపు వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, రెగ్యులర్ నగర అధ్యక్షులు ఎల్.ముతురాజు, నగర అధ్యక్ష, కార్యదర్శులు సాకే తిరుమలేష్, బండారి ఎర్రిస్వామి, ఎం.ఆదినారాయణ, నారాయణస్వామి, కోవిడ్ మలేరియా గార్బేజ్ క్లాప్ ఆటోడ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న కార్మికులు



ర్యాలీగా హిందూపురం వస్తున్న బాలకృష్ణ

హిందూపురానికి బాలకృష్ణ

నాయకులు, కార్యకర్తల ఘనస్వాగతం

ప్రజాశక్తి-హిందూపురం

ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటన అనంతరం శనివారం మొదటి సారిగా నందమూరి బాలకృష్ణ హిందూపురం విచ్చేశారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సూగూరు ఆంజనేయ స్వామి దేవస్థానం చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి ప్రచార రథంపై ఎమ్మెల్యే బాలకష్ణ పుర ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయనతో కలిసి ద్విచక్ర వాహనంలో బెంగళూరు రోడ్డు, మెయిన్ బజార్, అంబేద్కర్ సర్కిల్, గురునాథ్, తెలుగు తల్లి సర్కిల్ మీదుగా బాలకష్ణ నివాసం వరకు వేలాది మందితో ద్విచక్ర వాహన ర్యాలీగా నివాసం చేరుకున్నారు. బాలయ్యను చూసేందుకు ప్రజలు రోడ్డుపక్కన పెద్ద ఎత్తున నిల్చొన్నారు. మహిళలు జై బాలయ్య.. జై బాలయ్య అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మూడు కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ క్యాంపు కార్యాలయం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపికి షాక్..!

- పలు ప్రాంతాల్లో పార్టీకి నేతల గుడ్‌బై
- శింగనమలలో మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ముదిగుబ్బలో ఎంపిపి తదితరులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసిపికి పెద్ద షాక్ తగిలింది. పలు ప్రాంతాల్లో ఆ పార్టీ మఖ్య నేతలు వైసికి గుడ్‌బై చెప్పారు. శింగనమలలో మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ముదిగుబ్బలో ఎంపిపి, తనకల్లులో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ తదితరులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అధికార పార్టీలో తమకు గుర్తింపు లేకపోవడం వల్లనే పార్టీని వీడుతున్నట్లు రాజీనామా చేసిన నాయకులు ప్రకటించారు.



యామినీబాల

మాజీ ఎమ్మెల్యే యామినిబాల...

నార్పల : అనంతపురం జిల్లా శింగనమల మాజీ ఎమ్మెల్యే వైసిపికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె శనివారం నాడు అనంతపురం నుంచి ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. వైసిపి శింగనమల టికెట్ వ్యవహారంపై గత నెల రోజులుగా తీవ్ర అసమ్మతి నెలకొంది. వీరాంజినేయులకు టికెట్ ఇవ్వడాన్ని వైసిపి అసమ్మతి నేతలు నిరసిస్తున్నారు. ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా అభ్యర్థిని మార్చకపోవడంతో అసమ్మతి నేతలు ఇప్పటికే రాజీనామా చేస్తామని ప్రకటించారు. తాజాగా యామినీబాల ఆపార్టీకి రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరికొందరు వైసిపి నాయకులు శింగనమల నియోజకవర్గంలో ఆ పార్టీకి రాజీనామాలు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్...

ముదిగుబ్బ : ముదిగుబ్బ వైసిపి నాయకుడు, ఎంపిపి ఆదినారాయణ యాదవ్ వైసిపిని వీడుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయన తన నివాసంలో శనివారం నాడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాజీనామా చేస్తున్నట్లు తెలియజేశారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతం, యువతకు మంచి చేయాలన్న ఆశయంతో వైసిపిలో చేరానని తెలియజేశారు. ఎంపిపిగా తాను బాధ్యతలు చేపట్టినా వైసిపిలోని కొందరు స్వార్థ రాజకీయ నాయకుల కుట్రలు, కుతంత్రాలను జీర్ణించుకోలేక పోయాయనన్నారు. ఆ నాయకులు అభివద్ధి నిరోధక చర్యలకు పాల్పడడంతో అక్కడ ఉండలేకి పార్టీకి రాజీనామా చేశానని తెలియజేశారు. తాను వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ అభివద్ధికి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఎంతో కషి చేశానని తెలియజేశారు. గత ఐదు సంవత్సరాలుగా తన వ్యాపారాలు వదులుకుని ప్రజలకు సేవ చేయడానికి వచ్చానన్నారు. మండలంలో కొందరు దుష్టశక్తులుగా మారి ఈ ప్రాంతం అభివద్ధి, తన ఉన్నతికి ఆటంకాలు కల్పించారన్నారు. ప్రజలకు ఎలాంటి మేలు చేయలేనని భావించి గత్యంతరం లేని స్థితిలో రాజీనామా చేస్తున్నట్ల తెలియజేశారు. త్వరలో భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట మాజీ ఎంపీపీ..

కదిరి టౌన్ : నంబులపూలకుంట మండల మాజీ ఎంపిపి హనుమంతరెడ్డి టిడిపిలో చేరారు. కదిరి టిడిపి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన టిడిపిలో చేరారు. నంబులపులాకుంట మండలం మరికందిన్నె పంచాయతీకి చెందిన హనుమంత రెడ్డి గతంలో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. తిరిగి ఆయన తన అనుచరులతో కలిసి సొంతగూటికి చేరారు. తనతోపాటు ముస్తఫా, లక్ష్మీనరసింహా, వెంకటప్ప, ముసలయ్య తదితరులు టిడిపిలో చేరారు. కందికుంట విసయానికి శక్తివంచన లేకండా కృషి చేస్తానంటూ హనుమంతరెడ్డి తెలియజేశారు.

తనకల్లు మార్కెట్‌యార్డు ఛైర్మన్..


తనకల్లు : మండల పరిధిలోని చీకటిమానిపల్లి, గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, తనకల్లు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఎన్.ఈశ్వర్ రెడ్డి వైసిపిని వీడారు. శనివారం నాడు వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తు న్నట్లు ప్రకటించారు. గతంలో ఈయన భార్య స్వర్ణలత తెలుగుదేశం పార్టీ తరపున జెడ్పీటీసీగా పని చేశారు. తరవాత మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో వైసిపిలో చేరారు. ప్రస్తుతం ఆపార్టీకి రాజీనామా చేసి తిరిగి టిడిపిలోకి వెళ్లనున్నారు. ఆదివారం నాడు తెలుగుదేశం పార్టీ కదిరి నియోజకవర్గ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగుదేశంలో చేరనున్నట్లు ఆయన ప్రకటించారు.



ఈశ్వర్‌రెడ్డి



ముదిగబ్బలో విలేకరులతో మాట్లాడుతున్న ఆదినారాయణయాదవ్



కందికుంట సమక్షంలో టిడిపిలో చేరుతున్న హనుమంతరెడ్డి

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు నియోజకవర్గంలో సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాప్తాడు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత ఆర్ఓ, ఎస్‌డిపిఒ, ఏఈఆర్ఓలు, ఎంపిడిఓలు, ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, సికె పల్లి మండలాల పరిధిలో ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ఆర్ఓ, ఎస్డిపిఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల సజావుగా నిర్వహించాలంటే శిక్షణ అనేది చాలా ముఖ్యమని, రిటర్నింగ్ అధికారి స్వతహాగా శిక్షణ ఇవ్వాలన్నారు. అధికారులకు వల్నరబుల్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల మధ్య తేడా అనేది తెలిసి ఉండాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఏఎన్ఎం ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రాల వద్ద షామియానా, ఇతర అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల పోలింగ్ మెటీరియల్ తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఎన్నికల దృష్ట్యా ఎంసిసి అమలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఓ వసంతబాబు, తహశీల్దార్లు సుబ్రమణ్యం, పరమేశ్వరప్ప, రమాదేవి, రమణి, హమీద్ భాషా, సీతారాములు, ఎస్డిపిఓలు, ఎంపిడిఓలు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, ఇవిఎం కమిషనింగ్, స్ట్రాంగ్ రూమ్‌లలో ఏర్పాట్లను పరిశీలించారు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వి.వినోద్‌కుమార్

టార్గెట్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సివి.రామన్ టాలెంట్ సెర్చ్ రాత పరీక్షల్లో ర్యాంకులు

ప్రజాశక్తి-పుట్లూరు

జాతీయస్థాయి సర్ సివి.రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో తాడిపత్రి పట్టణంలోని టార్గెట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తెలుగు రాష్ట్రాల పరిధిలో 1500 పాఠశాలల్లో దాదాపు లక్ష మంది విద్యార్థులకు రాతపరీక్ష నిర్వహించగా, ఇందులో 16 మందికి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, 396 మందికి జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు లభించాయి. ఇందులో తాడిపత్రి పట్టణంలోని టార్గెట్ పాఠశాల నుంచి నలుగురు ప్రతిభచాటారని పాఠశాల కరస్పాండెంట్ జయచంద్ర తెలిపారు. తమ పాఠశాలకు చెందిన శరత్ బాబు రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం, పుట్లూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన పి.మిథున జిల్లా మొదటి, రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం, లక్ష్మీ అఖిల జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. హైదరాబాద్ పట్టణంలో గురువారం నాడు సుచరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ సివి.రామన్ యంగ్ జీనియస్ అవార్డు ప్రధాన కార్యక్రమంలో ముఖ్య అతిథులు లయన్ కిరణ్, ప్రముఖ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, శాస్త్రవేత్త శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ విద్యార్థులు ప్రశంసా పత్రాలు అందుకున్నారని తెలియజేశారు.



పి.మిథున

అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందిస్తా..

నాది 9 అంకెల నెంబర్ కాదు... : దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'ప్రజలకు ఏదైనా సమస్య వచ్చినా నాకే నేరుగా ఫోన్ చేయవచ్చు.. అర్ధరాత్రి వేళ అయినా స్పందిస్తా.. నాది 9 నెంబర్ల సెల్ ఫోన్ కాదు.. ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది' అంటూ టిడిపి అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం నగరంలోని 35వ డివిజన్‌లో చంద్రదండు రాష్ట్ర అధ్యక్షులు ప్రకాష్‌నాయుడు, మాజీ కార్పొరేటర్ రాజారావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం చాలా అధ్వాన్నంగా తయారైందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ దారుణంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాము అధికారంలోకి రాగానే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీతోపాటు డంపింగ్ యార్డును తరలించడమే తొలి కర్తవ్యంగా తీసుకుంటామన్నారు. అలాగే నగరానికి పరిశ్రమలు తీసుకొచ్చి మహిళలు, యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఇకపోతే ఏదైనా సమస్య ఉంటే పారిపోయే వ్యక్తిని కాదని.. మీరు అర్ధరాత్రి వేళ ఫోన్ చేసినా స్పందిస్తానన్నారు. వారిలా తొమ్మిది నెంబర్ల తరహాలో వ్యవహారం ఉండదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మదమంచి స్వరూప, టౌన్‌బ్యాంకు అధ్యక్షులు జె.ఎల్ మురళి, రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల నరసింహులు, మాజీ కార్పొరేటర్లు రాజా రావు, విజయలక్ష్మి, పావురాల శేఖర్, దలవాయి వెంకట నారాయణ, దలవాయి పొలన్న, గోళ్ల సుధాకర్, మైనార్టీ నాయకులు ఫిరోజ్, సైపుద్దీన్, తెలుగుయువత పార్లమెంటు అధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు నెట్టెం బాలకృష్ణ, గంగవరం బుజ్జి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ జి.వీర రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలో పోలీసుల విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలోని చంద్రబాబు కొట్టాల, రామ్‌నగర్, నాయక్‌నగర్‌లలో ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నాటక లిక్కర్, డబ్బు, ఎన్నికల తాయిలాలు అక్రమంగా తరలించకుండా తనిఖీ కొనసాగిస్తున్నామని 4వ పట్టణ సీఐ ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెలుగుప్ప : సాధారణ ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలోని రామసాగరం, గుండ్లపల్లి క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఎఫ్ఎస్‌టి టీం ఆధ్వర్యంలో ఎంపిడిఒ సుబ్బరాజు, ఎస్ఐ శివ, డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్‌పీరా, పోలీస్ సిబ్బందితో ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల్లో మద్యం, డబ్బు, ఇతర ఎన్నికలకు సంబంధించిన సామగ్రి రవాణా కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ వలి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై సమీక్ష

బెలుగుప్ప : ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాలు మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సుబ్బరాజు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రస్తావన నియమావళిపై టెక్నికల్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ రిపోర్టింగ్, ప్రతి గ్రామ పంచాయతీకి పది ఫారంపాండ్స్ రిజిస్టర్ ఎలా చేయాలి, తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సూర్యప్రకాష్, జయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ నాగేంద్రప్ప, విజయ్‌కుమార్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.



కూలీలను పరామర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి

కూలీలకు పరామర్శ


వజ్రకరూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని బూదగవి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీతో వెళ్తున్న ఆటో బోల్తా పడి 15 మంది గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మధుసూదన్‌రెడ్డి అనంతపురంలోని ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అంతకుముందు మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

క్రికెట్‌లో ఫైనల్ చేరిన అనంతపురం, బళ్లారి జట్లు

గుత్తి : పట్టణంలోని కాలవగడ్డ ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో క్రీడా మైదానంలో జరుగుతున్న యునైటెడ్ ఛాంపియన్స్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో శనివారం అనంతపురం ఆర్డీటీ ఎలైట్ బి టీం, ఎస్ ఆర్ కె బ్లాస్టర్స్ బళ్లారి జట్లు ఫైనల్‌కి చేరాయి. ఫైనల్ మ్యాచ్ ను పట్టణానికి చెందిన ప్రజలు తిలకించాలని నిర్వాహకులు ఎ.శ్రీనివాస్ బాబు, డి.రాఘవేంద్ర, ఆర్. కుమార్ (జోషి), టి.సురేష్ బాబు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

అనంతపురం : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రియా ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పాత రజనీబార్ సమీపంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వైద్యులు డాక్టర్ మోదుపల్లి ఉదయ్‌కుమార్, దేవినేని గీత, సిబ్బంది పలువురికి షుగర్, బి.పి, ఈసీజీ, గుండె, నరాలకు సంబంధించిన పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మోదుపల్లి లక్ష్మీప్రసాద్, సిఇఒ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైసిపికి 'బాబే' పెద్ద స్టార్ క్యాంపెయినర్

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధినేత జగనన్నకు టిడిపి అధినేత చంద్రబాబే పెద్ద స్టార్ క్యాంపెయినర్ అని రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం అనంతపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ 'జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క ఉద్యోగమైనా ఇచ్చాడా? అన్న చంద్రబాబు నోటిద్వారానే జగన్ 1.60 లక్షల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారు.. వారితోనే పింఛన్లు ఇప్పించమనండి' అని చెప్పడం చూస్తుంటే ప్రజలందరూ చర్చించుకుంటున్నారన్నారు. చంద్రబాబు చర్యలను బట్టి చూస్తుంటే వాలంటీర్లను స్టార్ క్యాంపెయినర్ అన్నట్టుగా మార్చింది ఆయనే అన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులను స్టార్ క్యాంపెయిన్లగా మార్చింది చంద్రబాబే అన్నారు. మొత్తం మీద జగనన్నకు అతిపెద్ద క్యాంపెనర్ చంద్రబాబునే అన్నారు. జగనన్న సంక్షేమ పథకాల లబ్ధిదారులందరూ జగనన్నకు క్యాంపియన్ చేస్తున్నారన్నారు. ఇక బిజెపితో జత కట్టడం చంద్రబాబు పతనానికి కారణమన్నారు. చంద్రబాబు ఓటమి భయం, అక్కసుతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాడనేది అర్థమవుతోందన్నారు. చంద్రబాబు తన ఓటమికి క్లియర్‌గా సెల్ఫ్‌గోల్ చేసుకున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లను పింఛన్లు పంపిణీ చేయకూడదని, వారి వద్ద ఉన్న మొబైళ్లు, ట్యాబ్‌లు స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది వాలంటీర్లు రాజీనామాలు చేశారన్నారు. వారందరూ ఇప్పుడు స్వచ్ఛందంగా జగన్ గెలుపు కోసం పని చేస్తామంటూ ముందుకు వచ్చారన్నారు. దీనికితోడు తాను అధికారంలోకి రాగానే వాలంటీర్ల నియామకాలపై తొలి సంతకం ఉంటుందని జగనన్న ప్రకటించడంతో వారంతా ఉత్సాహంగా ఉన్నారన్నారు. జగనన్న తుపాను, క్రేజ్, హవాలో 'కూటమి' కొట్టుకుపోవడం ఖాయమన్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ఎంపి, 14 అసెంబ్లీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

'దగ్గుపాటీ' నీ పార్టీ సంగతి చూసుకో..:అనంత



ఎన్నికల ప్రచారం చేస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

పజాశక్తి-అనంతపురం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ వైసిపిని విమర్శించే ముందు తన పార్టీ సంగతి చూసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హితవు పలికారు. నగరంలోని నగరంలోని 25వ డివిజన్‌లో శనివారం ఇంటింటికీ వైసీపీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా అనంత వచ్చే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో వైసీపీ గెలవబోతోందన్నారు. ఎందుకంటే ఎక్కడికెళ్లినా, ఎవరిని పలుకరించినా వైసీపీకే ఓటు వేస్తామని ప్రజలు చెబుతున్నారన్నారు. ముఖ్యంగా అనంతపురం నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామన్నారు. వైసిపి నుంచి వలసలు ప్రారంభమయ్యాయని చెబుతున్న దగ్గుపాటి ముందు మీ పార్టీ సంగతి చూసుకుంటే మంచిన్నారు. ఎందుకంటే ఇప్పటికే ఓ వర్గం సహకరించకుండా ధర్నాలు చేస్తోందన్నారు. ఒకరో ఇద్దరో తమ పార్టీ నుంచి పోయినా పర్వాలేదు... ప్రజల్లో వైసీపీకి ఆదరణ ఉందన్నారు. నీ దగ్గరున్న డబ్బుతో చంద్రబాబును, లోకేష్‌ను కొన్నట్లు అనంతపురంలో కొంతమందిని కొనగలవేమోగానీ, ప్రజలను కాదన్నారు.

అమ్మా..ఆశీర్వదించండి..

ఎం. వీరాంజనేయులు



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎం. వీరాంజనేయులు

ప్రజాశక్తి-శింగనమల

'అమ్మా.. నిరుపేద కుటుంబం నుంచి వచ్చా.. వచ్చే ఎన్నికల్లో ఆదరిస్తే మీకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తా..' అంటూ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని అమ్మవారిపేట, రేకులకుంట, గాంధీనగర్ గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. జగనన్న చేసిన మేలుని జీర్ణించుకోలేక చంద్రబాబు ఓటమి భయంతో ప్రజలను మభ్య పెట్టేందుకు జనసేన, బిజెపి కూటమిగా వస్తున్నారన్నారు. కూటమిని కుప్పకూల్చి ఇంటికి పంపుదామని పిలుపునిచ్చారు. వైసిపి పెత్తందారుల పార్టీ కాదన్నారు. వైసిపి ఒక పేదల పార్టీ అని.. నిరుపేదనైన తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. తాము ఎన్నికల ప్రచారానికి వెళ్తుంటే ఏ గ్రామానికి వెళ్లినా.. ఏ ఇంటికి వెళ్లినా.. ఏ ఒక్కరిని కదిపినా సిఎం జగనన్న చేసిన మంచిని తమకు వివరిస్తున్నారన్నారు. వారి కళ్లల్లో ఆనందంలో తమకు విజయం కనిపిస్తోందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభంజనాన్ని ఆపలేరన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్న అవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఆలూరు రమణారెడ్డి, రేకులకుంట నారాయణస్వామి, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, ఎంపిటిసిలు వెంకట శివారెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, పూల రంగ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

అనంతపురం : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ రెండవ లెవెల్ వెలువడిన ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ మేఘస్వరూప్, విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అనంతపురం మూడవ బ్రాంచికి చెందిన బి.నవదీప్, 1వ బ్రాంచికి చెందిన టి.చరిత, సీబీఎస్ఈ బ్రాంచికి చెందిన పూర్వజ్ రామ్, కళ్యాణదుర్గం బ్రాంచికి చెందిన మనస్వి గ్రాండ్ ప్రైజుల కింద లాప్‌టాప్ లను గెలుచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, సమీనాఖాన్, తబసుం, ఖలందర్, శాంత, ఫిలిప్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, నాగభూషణం, డీన్లు శ్రీనివాస్‌రెడ్డి, సిరాజ్, గంగాధర్, సత్యనారాయణ, చిరంజీవి, తిప్పారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి సిఎం చేసుకుందాం

పామిడి : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌ను మరోసారి సిఎంను చేసుకుందామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని దేవరపల్లి గ్రామంలో వైస్ ఎంపిపి నక్కా సౌభాగ్య ఓబులేసు ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, రూరల్ కన్వీనర్ నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, జోజోడే కుమార్, ఎద్దులపల్లి రామకృష్ణారెడ్డి, పొట్టిపాటి శ్రీనివాసులు, నీలూరి శంకరయ్య, నక్కా నారప్ప, చిన్న ఓబిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

రాయదుర్గం : గుమ్మఘట్ట మండలం కొత్తపల్లి గ్రామంలో వైసిపి నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శమన్నారు. వచ్చేనెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి లోకసభ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ బోయ పామిడి వీరాంజనేయులు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతరెడ్డి, మండల ప్రజాప్రతినిధులు ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచులు, వైస్ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

అనంతపురం : స్థానిక రుద్రంపేట బైపాస్‌లోని శ్రీచైతన్య పాఠశాల ఎటిపి-10 బ్రాంచిలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీకి వెళ్లే విద్యార్థులు, ప్రైమరీ ఫిఫ్త్ నుంచి హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు పట్టాతోపాట బంగారు పతకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎఒ విజయ్‌కృష్ణ, ప్రైమరీ ఇన్‌ఛార్జి సరిత, శబరీన్, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి అమరావతి, డాన్స్ మాస్టర్ విష్ణు, డ్రాయింగ్ మాస్టర్ మధుకర్, పిఈటి శివప్రసాద్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీపై చర్యకు డిమాండ్

పుట్లూరు : పనులు చేసి బిల్లులు మంజూరైనా జాప్యం చేస్తున్న పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని కందికాపుల సర్పంచి శివరామయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం అనంతపురంలోని జిల్లా పంచాయతీ కార్యాలయం ఎఒ విశ్వనాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కందికాపుల, చింతకుంట గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పైపులైన్లు, బోర్ల మరమ్మతులు, పారిశుధ్య పనులు చేశామన్నారు. ఈ బిల్లులు దాదాపు రూ.3లక్షలకు సంబంధించి ఇఒఆర్‌డి ఆమోదించి పంచాయతీ కార్యదర్శికి పంపించారన్నారు. అయితే పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి బిల్లులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

పామిడి : మండల కేంద్రంలోని బీసీసీ రోడ్డు నాగిరెడ్డి కాలనీలో భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసిన శనివారం చలివేంద్రాన్ని సిఐ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రద్దీ ప్రాంతమైన బీసీసీ రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సభ్యులు బేల్దార్ అల్లాబకాష్, బేల్దార్ రాము, జీలాన్, షేక్షావలి, బేల్దార్ బాబా పాల్గొన్నారు.

వైసిపిని గద్దె దించేందుకు ప్రజలు 'సిద్ధం' : పయ్యావుల



పయ్యావుల కేశవ్‌కు బొట్టు పెడుతున్న మహిళ

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనిటిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం ఉరవకొండలోని కమ్మన్నకట్ట, టెక్క వీధి, చౌడమ్మ గుడి ఏరియా, వెంకటేశ్వర సినిమా థియేటర్ వెనుక కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనలో ఉద్యోగ, నిరుద్యోగ, రైతులు, చేనేతలతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. సిఎం జగన్ విధానాలతో విసిగిన ప్రజలు టిడిపికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : వచ్చే సాధారణ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని ఆయన తనయుడు విజయసింహ విజ్ఞప్తి చేశారు. శనివారం మండల పరిధిలోని గంగవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ అధికారంలోకి వస్తే టిడిపి అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌సింహ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. రాష్ట్రం తిరిగి అభివృద్ధి కావాలంటే చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఆసన్నమైందనఆనరు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు కలిసొచ్చినా గెలుపు ఖాయం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎవరు.. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా వైసిపి గెలుపును ఆపలేవని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో 'మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏదో రూపంలో సంక్షేమ పథకాలు అందించిందన్నారు. ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గానికే రూ.4120 కోట్లు అందించిందని వివరించారు. అయితే డబ్బులు సంచులతో మార్కెట్లలో పశువుల మాదిరి జనాలను డబ్బులతో అలమినేని సురేంద్రబాబు కొనలేడన్నారు. మూడు పార్టీలు కలిసొచ్చినా నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో వైసిపి గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమ ంలో నాయకులు ఉమామహేశ్వర నాయుడు, ప్రసాద్‌రెడ్డి, చందన శివాజీ, దొనస్వామి, తిప్పేస్వా మి, సత్యనారాయణశాస్త్రి, మారుతీశ్వరి రామ్మూర్తి, కమల నాగరాజు, రాధాస్వామి, లక్ష్మీ అజయ్‌బాబు, భీమ్‌రెడ్డి, ముజీవులా, రాము, పాలాక్షి, లింగప్ప, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యుఎఫ్‌ఎపిజిఇటిడబ్ల్యూపి జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఈరాలప్ప



బి.గోపీకృష్ణ

అనంతపురం క్రైం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక (యుఎఫ్‌ఎపిజిఇటిడబ్ల్యూపి) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఛైర్మన్‌గా బి.గోపీకృష్ణ (ఎపిజిఇఎ), సెక్రటరీ జనరల్‌గా ఈరాలప్ప(కెటిఎ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రభాకర్ (ఎపిసిపిఎస్ఇఎ), కోశాధికారిగా ఎం.సాంబశివమ్మ (వైద్యం), పబ్లిసిటీ సెక్రటరీగా సన్ని జాషువా (ఆర్‌అండ్‌బి), కో ఛైర్మన్లుగా పీవీ శ్రీనివాసులు (ఎన్‌టిఎ), వి.బి.భాస్కర్‌రెడ్డి (ఎపిజిఇఎ, ఎస్.రాముునాయక్ (సోషల్ వెల్ఫేర్), వైస్ ఛైర్మన్లుగా జె.వెంకటేష్ (డిటిడబ్ల్యూఎ), మహేశ్వర్‌రెడ్డి (ఎపిజిఇఎ, కె.జయరాం (ఎపిఎస్‌సిపిఎస్‌టిడబ్ల్యూఇఎ), శివమూర్తి (బీసీటియు), ఎం.శ్రీరాములు (వైద్యం), డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా రవీంద్రనాయక్ (జియుఎస్), కె.సి.నాగరాజు (ఆర్‌అండ్‌బి), బి.వేణుగోపాల్ (వైద్యం), జయరామ్‌నాయక్ (వైద్యం), ఫక్రుద్దీన్(వైద్యం), ఎం.లక్ష్మీనారాయణ (పిఎస్ హెచ్‌ఎంఎ), సి.ఈశ్వరయ్య (ఆర్‌అండ్‌బి), రాజానాయక్ (ఐసిడిఎస్), లక్ష్మీనారాయణ (గ్రామ వార్డు సచివాలయం)ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర కో ఛైర్మన్ కరణం హరికృష్ణ తెలిపారు.

రాజీనామాల సీజన్



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు వచ్చాయంటే చాలు.. నేతల హడావుడి మొదలవుతుంది. అధికారం ఎటు వైపు మొగ్గుందో చూసుకుని ఆ వైపునకు ముందుగానే చేరుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోనూ అవే కొనసాగుతున్నాయి. ఈవారంలో అసంతృప్తులు, అసమ్మతులు తారాస్థాయికి చేరాయి. అదే సమయంలో రాజీనామాల పర్వమూ మొదలైంది. హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఈవారంలో రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. పార్టీకే కాకుండా ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేశారు. హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తప్పించినప్పటి నుంచి ఆయనకు ప్రాధాన్యత లేదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆయన టిడిపిలో చేరనున్నట్టు ప్రచారం నడుస్తోంది. అదే సందర్భంలో వైసిపికి రాజీనామీ చేస్తున్నట్టు శింగనమల మాజీ ఎమ్మెల్యే యామినీబాల కూడా ప్రకటించడం గమనార్హం. 2019లో ఆమెకు టిడిపి టిక్కెట్ ఇవ్వకపోవడంతో వైసిపిలో చేరారు. అయితే అక్కడా ఎటువంటి ప్రాధాన్యత లేదన్న ఉద్దేశంతో రాజీనామా చేసినట్లు సమాచారం. ఇక ధర్మవరంలోనూ వైసిపి రాజీనామాలు పెరుగుతున్నాయి. చేనేత నాయకుడు గిర్రాజు రాజీనామా చేశారు. ఆ మరుసటి రోజు ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ రాజీనామా చేశారు. ఇక అనంతపురం అర్బన్‌లో ముగ్గురు కార్పొరేటర్లు జయరామ్‌నాయుడుతోపాటు వైసిపికి గుడ్‌బై చెప్పి టిడిపిలో చేరారు. ఇది ఇలాగుంటే టిడిపి నుంచి కూడా ఇప్పటికే ముగ్గురు నేతలు రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు టిడిపికి రాజీనామా చేసి వేసిపిలో చేరారు. కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా టిడిపికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. తాజాగా మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప కూడా టిడిపిని వీడుతున్నట్టు ప్రకటించారు. ఇలా రెండు వైపుల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ఇక నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నాయకుల పార్టీలు మార్పులు కుప్పలు తెప్పలుగా జరుగుతున్నాయి. ఈరోజు ఇక్కడున్నోడు.. రేపటిలోపు కండువ మార్చేస్తున్నారు. వీరిని పట్టుకోవడం.. అలకలు మాన్పడం ఎలాగన్నది అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. ఓటర్లను కలవడం ఒక ఎత్తయితే బుజ్జగింపులు మరో ఎత్తు అవుతోంది. రాజకీయ పరిణామాలు ఇలాగుంటే ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం అధికార యంత్రాంగాన్ని నివ్వెరపరచింది. ఇకపోతే కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌లను బాధ్యతల నుంచి తప్పిస్తూ తీసుకున్న నిర్ణయం జిల్లాలో పెద్ద చర్చనీయాంశం అయింది. ఒకేసారి ఇద్దరు జిల్లా ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవడంతో అందరూ అప్రమత్తమయ్యారు. వెంటనే కొత్త అధికారులను నియమించడం వారొచ్చి బాధ్యతలు తీసుకోవడం రెండు రోజుల వ్యవధిలో పూర్తయ్యాయి. కొత్త కలెక్టర్‌గా వినోద్‌కుమార్, ఎస్పీగా అమిత్ బర్దర్‌ను నియమించారు. ఎపి ఎస్పీ బెటాలియన్ నుంచి నియమించడంతో వెంటనే ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంకా మరికొంత మంది డివిజనల్ స్థాయి అధికారుల మార్పులుంటాయని ప్రచారం నడుస్తోంది. జిల్లాలో ఎవరిపై ఈ రకమైన వేటు పడుతుందోనని భయపడుతున్నారు.

ప్రజల్లో ఉండే 'విశ్వ'ను ఆదరించాలి

బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కెవి రమణ



విలేకరులతో మాట్లాడుతున్న బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కెవి రమణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

స్వార్థ రాజకీయాలు చేసే టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను ఓడించి నిత్యం ప్రజ సమస్యల పరిష్కారం కోసం పని చేసే వైసిపి అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కెవి.రమణ, నియోజకవర్గ వైసిపి ఐటి వింగ్ ఇన్‌ఛార్జి సత్యం రెడ్డి, పెన్నాఅహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి ఓడినా, గెలిచినా నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పని చేస్తారన్నారు. అదే టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలిచినా, ఓడినా ప్రజలకు దూరంగా ఉంటారన్నారు. అలాంటి వ్యక్తి రానున్న ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసం చేయడానికి అసత్య ప్రచాలతో వస్తున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పని చేసిన కేశవ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకుల కళ్లబొల్లి మాటలు నమ్మకుండా వైసిపిని ఆదరించాలని కోరారు.



విక్రమ్‌ప్రసాద్

యోగాలో విక్రమ్‌ప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ

గుత్తి : పట్టణంలోని ఆర్కే యోగా కేంద్ర విద్యార్థి విక్రమ్‌ప్రసాద్ యోగా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పట్టణానికి చెందిన విక్రమ్ ప్రసాద్ కోనేళ్లుగా ఆర్కే యోగా కేంద్రంలో శిక్షణ తీసుకున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో విక్రమ్ ప్రసాద్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించాడు. దీంతో సర్టిఫికెట్ అందజేసినట్లు ఆర్కే యోగా కేంద్ర శిక్షకుడు రామకృష్ణారావు తెలిపారు.